క్లుప్తంగా

కోడిపందాలు నిర్వహిస్తే కఠిన చర్యలు


సీఐ ప్రభాకర్

భోగాపురం: సంక్రాంతి పండగ వేళ కోడిపందాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని భోగాపురం అప్‌గ్రేడ్ పోలీస్‌స్టేషన్ సీఐ ఎన్వీ ప్రభాకర్ హెచ్చరించారు. ఇదే విషయమై ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడారు. పండగ రోజుల్లో పేకాట, కోడి పందాలు జరిగే శిబిరాలపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. ఎవరైనా జూదం ఆడినట్లు కనిపిస్తే చర్యలకు వెనుకాడేది లేదన్నారు. గతంలో పేకాట, కోడిపందాల ఘటనల్లో అరెస్టయిన వారిపై మెజిస్ట్రేట్ వద్ద బైండోవర్ చేస్తున్నామన్నారు. పందాలు, బెట్టింగులు చట్ట వ్యతిరేకమని, అటువంటి వాటికి పాల్పడినా, ప్రోత్సహించినా శిక్షార్హులన్నారు.

వితరణ


స్టీల్‌ప్లేట్లు అందజేస్తున్న దాతలు

నెల్లిమర్ల రూరల్: పవిత్ర పుణ్యక్షేత్రమైన రామతీర్థం శ్రీసీతారామస్వామి దేవస్థానానికి విజయనగరానికి చెందిన ఇన్నర్ వీల్ క్లబ్ ఉమెన్స్ అసోసియేషన్ సభ్యులు 50 స్టీల్‌ప్లేట్లు ఆదివారం వితరణ చేశారు. ఆలయం వద్ద జరిగే నిత్యాన్నదానానికి వచ్చే భక్తులకు ఉపయోగపడతాయన్న సదుద్దేశ్యంతో వీటిని పంపిణీ చేసినట్లు దాతలు తెలిపారు.

విద్యార్థుల ప్రతిభ


బహుమతులతో విద్యార్థులు

పూసపాటిరేగ: జిల్లా స్థాయి వేదిక్ మ్యాథ్స్, అబాకస్ పోటీల్లో మండలంలోని టక్‌ల్యాండ్ పాఠశాల విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచారు. విజయనగరం గురుదత్త పాఠశాలలో ఆదివారం జరిగిన పోటీల్లో అబాకస్ పోటీల్లో అట్టాడ పవన్, షేక్ ఆసిఫ్, కొల్లి హర్షితలు.. వేదిక్ మ్యాథ్స్ పోటీల్లో టి.జయదేవ్ విజేతలు నిలిచి, బహుమతులు కైవసం చేసుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ సీహెచ్ శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ సీహెచ్ రవి తదితరులు పాల్గొన్నారు.

క్షతగాత్రులకు ఆర్థికసాయం


బాధిత కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం అందజేస్తున్న దృశ్యం

భోగాపురం: మండల కేంద్రంలోని సవరవిల్లి హైవే రోడ్డులో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయాలపాలైన రావాడ గ్రామస్తులు గొంప సాగర్, కొయ్య జగన్‌మోహన్‌రెడ్డికి ఎమ్మెల్యే లోకం నాగమాధవి ఆర్థికసాయం చేశారు. వారు గాయపడి విశాఖపట్నంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే.. సదరు వ్యక్తులకు ఆర్థికసాయం అందజేయాలని స్థానిక జనసేన పార్టీ నాయకులను ఆదేశించారు. ఈ మేరకు ఆ పార్టీ మండల అధ్యక్షుడు వందనాలు రమణ.. వారి వద్దకు ఆదివారం వెళ్లి ఒక్కొక్కరికి రూ.25 వేలు చొప్పున అందజేశారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు రాధాకృష్ణరెడ్డి, చెల్లుబోయిన రాము, బొల్లు త్రినాథ్, లంక సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆరోగ్య తనిఖీలు

రేగిడి: స్థానిక ఉంగరాడమెట్ట వద్ద ఉన్న గురుకుల పాఠశాలలో విద్యార్థులకు ఆదివారం ఆరోగ్య తనిఖీలు నిర్వహించారు. ఖండ్యాం ప్రభుత్వ ఆయుర్వేద వైద్యాధికారి ఎం.సునీల్ కుమార్ ప్రత్యేకంగా వైద్య శిబిరం ఏర్పాటు చేసి మరీ విద్యార్థుల ఆరోగ్యంపై ఆరాతీసి, వివిధ ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి ఉచితంగా మందులు అందజేశారు. బాల్యం నుంచే మంచి ఆహారపు అలవాట్లు అలవర్చుకోవాలన్నారు. ఆరోగ్యమే మహాభాగ్యమని, ప్రతిఒక్కరూ మంచి ఆరోగ్యానికి పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. భోజనానికి ముందు, తర్వాత చేతులను శుభ్రం చేసుకోవాలని, ఉతికిన బట్టలు వేసుకోవాలని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ డి.సూర్యనారాయణ పాల్గొన్నారు.

నవోదయ మోడల్ టెస్ట్ రేపు

వంగర: మండలంలోని ఎం.సీతారాంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ నెల 7వ తేదీన నవోదయ మోడల్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు బి.బాలమోహనరావు ఓ ప్రకటనలో ఆదివారం తెలిపారు. ఎం.ఎస్.చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగే ఈ పరీక్షకు రావాలనుకునే వారు మధ్యాహ్నం 12 గంటల్లోగా పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. పరీక్షలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన తొలి ఐదుగురికి బహుమతులతో పాటు నగదు బహుమతి, మధ్యాహ్న భోజనం ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు ఫోన్ నంబర్ 7989929915ను సంప్రదించాలని కోరారు.

సంక్రాంతికి.. పనులు పూర్తయ్యేనా..?

- రహదారుల పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంది
- పనులు నత్తనడకన సా........గుతున్నాయి


మలిచెర్ల నుంచి చెరువు గట్టుమీదుగా విజయనగరం వచ్చే రహదారి దుస్థితి


పినవేమలిలో రహదారి ఇలా..


జొన్నవలస రోడ్డు పరిస్థితి ఇది..

విజయనగరం రూరల్:

సంక్రాంతి పండగ నాటికి రహదారుల పనులు పూర్తి చేస్తాం.. ఏ గ్రామంలో కూడా అధ్వాన రహదారి లేకుండా చూస్తామని కూటమి నాయకులు ఇటీవల కాలంలో గొప్పగా ప్రకటనలు గుప్పించారు. అయితే వాస్తవ పరిస్థితి మాత్రం అందుకు భిన్నంగా ఉంది. గత నెలలో టెండర్లు నిర్వహించి కాంట్రాక్టర్లకు రహదారుల పనులు అప్పగించారు. అయితే పనులు ప్రారంభించి నెల రోజులవుతున్నా ఎక్కడి వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంది. పనులు నత్తనడకన సా............గుతున్నాయి. సంబంధిత అధికారులు కాంట్రాక్టర్లపై ఒత్తిడి తీసుకువస్తున్నా ఫలితం లేదు.

నిధులు మంజూరైనా ఫలితం శూన్యం..

మండలంలోని వై జంక్షన్ కూడలి నుంచి కోరుకొండపాలెం వరకు ఉన్న రహదారిలో గుంతలను పూడ్చడానికి రూ.30 లక్షలు మంజూరు చేశారు. అలాగే కొండకరకాం నుంచి కలెక్టరేట్ వరకు గల రహదారి మరమ్మతులకు రూ.30 లక్షలు మంజూరయ్యాయి. ద్వారపూడి మీదుగా గుంకలాం నందాం గ్రామం వెళ్లే రహదారిలో గుంతలు పూడ్చేందుకు రూ.60 లక్షలు.. చాకలిపేట నుంచి జొన్నవలస, పినవేమలి వెళ్లే రహదారికి రూ. 30 లక్షలు..అయ్యన్నపేట నుంచి జొన్నవలస రహదారికి రూ. 30 లక్షలు మంజూరయ్యాయి. అయితే ఇంతవరకు పనులు మాత్రం పూర్తి కాలేదు. నిధులు అందుబాటులో ఉన్నా పనులు పూర్తి కాకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నిధులు స్వాహా అయ్యాయా.. లేక పనులు చేస్తారా అన్న మీమాంస నెలకొంది. కూటమి నాయకులు మాటలకే పరిమితం అవుతున్నారు తప్ప పనులు చేయలేకపోతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి రహదారులను అభివృద్ధి చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై సంబంధిత ఆర్‌అండ్‌బీ జేఈ విక్రమ్ వద్ద సాక్షి ప్రస్తావించగా.. మరమ్మతులు చేపట్టాలని కాంట్రాక్టర్లను ఆదేశించామన్నారు. త్వరితగతిన పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.


అధ్వానంగా జొన్నవలస - రాకోడు రహదారి

రాకపోకలు సాగించలేకపోతున్నాం..

అధ్వాన రహదారులపై రాకపోకలు సాగించడానికి ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. అడుగుకో గొయ్యి ఉండడంతో ఏ మాత్రం నిర్లక్ష్యంగా ఉన్నా ప్రమాదాలు తప్పడం లేదని వాహన చోదకులు ఆందోళన చెందుతున్నారు. కొత్త రోడ్లు వేయడం మాట పక్కనబెడితే ఉన్న రోడ్లకు మరమ్మతులు చేపడితే అదే చాలని ప్రజలు కోరుకుంటున్నారు. ఎన్నికల సమయంలో అది చేస్తాం.. ఇది చేస్తామని ఊకదంపుడు ఉపన్యాసాలు చేసే నాయకులకు మా ప్రయాణ కష్టాలు కనిపించడం లేదా పలువురు ప్రశ్నిస్తున్నారు.

రక్తమోడుతున్న జాతీయ రహదారి

- పోలిపల్లి రహదారిపై వరుస ప్రమాదాలు
- నెల రోజుల వ్యవధిలో ఆరుగురు మృత్యువాత
- జాతీయ రహదారి డిజైన్ లోపమే కారణమంటున్న వాహన చోదకులు
- ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలి


పోలిపల్లి వద్ద జాతీయ రహదారి

పూసపాటిరేగ: జిల్లాలోని పూసపాటిరేగ, భోగాపురం మండలాలను కలుపుతూ వెళ్తున్న చెన్నై - కోల్‌కత్తా జాతీయ రహదారిపై భోగాపురం మండలం పోలిపల్లి సమీపంలో వరుస ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. దీంతో వాహన చోదకులు భయాందోళనకు గురవుతున్నారు. పోలిపల్లి ఫ్లైఓవర్ వద్ద గల పెట్రోల్‌బంక్ సమీపంలో వరుస ప్రమాదాలు జరగడంతో సమీప గ్రామాలు ప్రజలు హడలెత్తిపోతున్నారు. నెల రోజుల వ్యవధిలో భోగాపురం మండలంలో జరిగిన ప్రమాదాలలో 10 మంది మృత్యువాత పడగా, పోలిపల్లి వద్దే ఆరుగురు కన్నుమూశారు. పోలిపల్లి ఫ్లై ఓవర్ సమీపంలో రహదారి డిజైన్ లోపం కారణంగానే వరుస ప్రమదాలు జరుగుతున్నట్లు పలువురు వాహనదారులు ఆరోపిస్తున్నారు. 2024 నవంబర్ 30న పోలిపల్లి పెట్రోల్ బంక్ సమీపంలో జరిగిన కారు ప్రమాదంలో శ్రీకాకుళంనకు చెందిన దబిడి కౌశిక్‌రెడ్డి, వడ్డే అభినవ్, వడ్డే మణిమాల, జయేష్‌లు మృతి చెందారు. డిసెంబరు 26న అదే ప్రదేశంలో జరిగిన కారు ప్రమాదంలో తమిళనాడు మీనంబాకంకు చెందిన భార్యాభర్తలు నాగిరెడ్డి యాదుకుమార్, నాగిరెడ్డి సాయిలీల మృతి చెందారు. అలాగే నవంబర్ 9న నారుపేట సమీపంలో జరిగిన ప్రమాదంలో షేక్ ఆరీఫ్ మృతి చెందారు. భోగాపురం నుంచి రాజాపులోవ వరకు తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. హైవే నిర్వహణకు లక్షలాది రుపాయలు ఖర్చు చేస్తున్నప్పటికీ ప్రమాదాలు తగ్గడం లేదు. హైవేలో డిజైన్ లోపమా.. లేదా వాహనదారుల నిర్లక్ష్యమో తెలియడం ఇప్పటికై నా సంబంధిత అధికారులు స్పందించి జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు తగు చర్యలు తీసుకోవాలని వాహన చోదకులు, స్థానికులు కోరుతున్నారు.

ప్రమాదాలు జరుగుతున్నాయి..



పోలిపల్లి సమీపంలో వరుస ప్రమాదాలు జరగడం వాస్తవమే. పోలిపల్లి వద్ద ప్రమాదాలు జరగడానికి గల కారణాలపై ఇప్పటికే హైవే అధికారులు, రవాణాశాఖ అధికారులకు తెలియజేశాం. ఫ్లై ఓవర్ దిగిన వెంటనే మలుపు ఉండడంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఒకే ప్రదేశంలో రెండు ప్రమాదాలు జరిగాయి. కారణాలపై పూర్తిస్థాయిలో హైవే ఇంజినీరింగ్ అధికారులు పరిశీలన చేసి ప్రమాదాలు నివారణకు చర్యలు తీసుకోవాలి.

ఎన్. ప్రభాకర్, సీఐ భోగాపురం.

చర్యలు తీసుకోవాలి..



చెన్నై - కోల్‌కత్తా జాతీయ రహదారిలో వరుస ప్రమాదాలు జరుగుతున్నాయి. నెల రోజుల వ్యవధిలో పోలిపల్లి సమీపంలో ఒకే ప్రదేశంలో జరిగిన రెండు ప్రమాదాల్లో ఆరుగురు మృత్యువాత పడ్డారు. ఒకే ప్రదేశంలో ప్రమాదాలు జరగడంతో డిజైన్ లోపమా లేదా మరేదైనా కారణం ఉందా అనేది తెలియాల్సి ఉంది. నేషనల్‌హైవే అధికారులు పరిశీలన చేసి చర్యలు తీసుకోవాలి.

ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి, ప్రజాప్రతినిధి భోగాపురం మండలం


పోలిపల్లి వద్ద నలుగురు మృత్యువాత పడిన ప్రమాదం (ఫైల్)


పోలిపల్లి వద్ద జరిగిన ప్రమాదంలో సంఘటనా స్థలంలో మృతదేహాలు (ఫైల్)

పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలి


విద్యార్థితో పుస్తకం చదివిస్తున్న లైబ్రేరియన్ మహేశ్

డెంకాడ: విద్యార్థులంతా పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలని, పుస్తకాలు చదవడం ద్వారా అపారమైన జ్ఞానం లభిస్తుందని లైబ్రేరియన్ మహేశ్ అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో చదవడం మాకిష్టం కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. గ్రంథాలయానికి విచ్చేసిన విద్యార్థులకు పుస్తకాలు చదవడం ద్వారా కలిగే ప్రయోజనాలు, ఆ పుస్తకాలు ఏ విధంగా చదివి అర్థం చేసుకోవాలన్న విషయాలను లైబ్రేరియన్ వివరించారు. అనంతరం విద్యార్థులతో పుస్తకాలు చదివించారు. గ్రంథాలయంలో అందుబాటులో ఉన్న పుస్తకాలను సద్వినియోగం చేసుకుని, జ్ఞానవంతులుగా తయారుకావాలని ఆకాంక్షించారు.

ఆదర్శ రైతుగా విశ్వనాథం


ఆదర్శరైతు అవార్డు అందుకుంటున్న విశ్వనాథం

బొబ్బిలి రూరల్: మండలంలోని పెంట గ్రామానికి చెందిన రైతు చోడవరపు విశ్వనాథం తనకున్న 12 ఎకరాల్లో సేంద్రియ వ్యవసాయం చేసి అందరికీ ఆదర్శంగా నిలిచాడని వక్తలు కొనియాడారు. ఈ మేరకు గుంటూరులో నిర్వహిస్తున్న సంక్రాంతి సంబరాల్లో భాగంగా రైతునేస్తం అనే స్వచ్ఛంద సంస్థ విశ్వనాథంను ఆదర్శరైతుగా ఎంపిక చేసి ఆదివారం సన్మానించింది. మంత్రి అచ్చెన్నాయుడు అవార్డు అందజేశారు.

మామిడిని ముంచుతున్న మంచు

- పొగ మంచు ప్రభావంతో మాడిపోతున్న పూత
- పంటను ఆశిస్తున్న తేనె మంచు పురుగు, ఇతర తెగుళ్లు
- ఆందోళనలో రైతులు

ఎస్.కోట నియోజకవర్గంలో మామిడి తోటల సాగు వివరాలు	
మండలం	సాగువిస్తీర్ణం (ఎకరాల్లో)
ఎస్.కోట	1,048
వేపాడ	2,230
ఎల్.కోట	2,772.50
కొత్తవలస	610
జామి	3,355


జామి మండలంలోని అలమండలో మామిడి తోటను పరిశీలించి రైతుకు సూచనలు చేస్తున్న హెచ్‌ఓ అనిత

లక్కవరపుకోట: కొద్దిరోజులుగా దట్టంగా కురుస్తున్న పొగమంచు మామిడిని ముంచుతోంది. ఉదయం ఎనిమిది గంటల వరకూ మంచు కురుస్తునే ఉండడంతో మామిడి పూత మాడిపోతోందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎస్.కోట నియోజకవర్గంలో రైతులు పదివేల ఎకరాల్లో మామిడి పంటను సాగు చేస్తున్నారు. ఈ ఏడాది వాతావరణం అంతగా అనుకూలించకపోవడంతో మామిడితోటల్లో పూత ఆలస్యం గా వచ్చింది. అరకొరగా వచ్చిన పూత కూడా రాలిపోతోందని రైతులు గగ్గోలు పెడుతు న్నారు. అల్పపీడనం ప్రభావంతో డిసెంబర్ నెలలో కురిసిన వర్షాలు మామిడి పంటకు నష్టం కలిగించాయి. వర్షాల వల్ల పూత రాకపోగా ముందే అక్కడక్కడా అరకొరగా వచ్చిన పూత సైతం ఇప్పుడు రాలిపోతుండడంతో పాటు ఆకులు నల్లగా మాడిపోతున్నాయి. వర్షాల వల్ల జరిగిన నష్టం నుంచి పంట తేరుకుంటుందనుకునే సమయంలో మంచు రూపంలో మళ్లీ పంటకు నష్టం కలుగుతోంది. పొగ మంచు వల్ల పంటను తేనె మంచు పురుగు, ఇతర తెగుళ్లు ఆశిస్తున్నాయి.


తేనె మంచుకారణంగా ఎల్.కోట మండలం భీమాళి ప్రాంతంలో రాలిపోతున్న మామిడిపూత


ఎల్.కోట మండలంలోని శ్రీరాంపురంలో కురుస్తున్న మంచు


లక్కవరపుకోట మండలం శ్రీరాంపురంలో మామిడి తోట

సస్యరక్షణ పాటించాలి



మామిడి సాగు చేసే రైతులు సస్యరక్షణ చర్యలు సకాలంలో చేపడితే అధిక లాభాలు పొందవచ్చు. తేనె మంచు పురుగు వల్ల పూతరాలిపోయే అవకాశం ఉంటుంది. నివారణకు మోనోక్రోటోపాస్ 1.5 మిల్లీలీటర్లను లీటర్ నీటిలో కలిపి ఎకరానికి 200 లీటర్ల ద్రావణాన్ని, లేదా క్లోరీపైరిపాస్ రెండు మిల్లీలీటర్ల మందును లీటర్ నీటిలో కలిపి 200 లీటర్ల ద్రావణాన్ని పిచికారీ చేసుకోవాలి. పొటాష్ లోపంతో కూడా పూత రాలిపోయే అవకాశం ఉంది. 5 గ్రాముల పొటాషియం నైట్రేటును లీటర్ నీటిలో కలిపి 200 లీటర్ల ద్రావణాన్ని ఎకరానికి, 15 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేసుకుంటే పూత నిలవడంతో పాటు నాణ్యత పెరుగుతుంది. సాగులో శాస్త్రీయ పద్ధతులను అవలంభించాలి.

– టి.అనిత, ఉద్యానవనశాఖ అధికారి, శృంగవరపుకోట

పరామర్శ..


బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న బడ్డుకొండ అప్పలనాయుడు, తదితరులు

నెల్లిమర్ల: నెల్లిమర్ల నగర పంచాయతీ పరిధిలోని జరజాపుపేటకు చెందిన మన్యపురి సోములు కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు ఆదివారం పరామర్శించారు. సోములు భార్య లక్ష్మి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే గ్రామానికి చేరుకుని మృతురాలి కుమారులు మన్యపురి మోహనరావు, రామునాయుడులను పరామర్శించి, ఓదార్చారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అంబల్ల శ్రీరాములనాయుడు, జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు, నగర పంచాయతీ వైస్ చైర్మన్ సముద్రపు రామారావు, వైస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి రేగాన శ్రీనివాసరావు, స్థానిక నాయకులు మద్దిల వాసు, నల్లి శ్రీను, పోలుబోతు నారాయణమూర్తి ఉన్నారు.

ఉత్సాహంగా కబడ్డీ పోటీలు


కబడ్డీలో తలపడుతున్న క్రీడాకారులు

రాజాం సిటీ: మండలంలోని పొగిరి గ్రామంలో జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు ఉత్సాహంగా ఆదివారం జరిగాయి. గ్రామానికి చెందిన శాసుబిల్లి సాయిశంకర్ జ్ఞాపకార్థం నిర్వహించిన ఈ పోటీలను గ్రామపెద్దలు ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ యువత చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఆకాంక్షించారు. ఈ పోటీల్లో 12 మండలాల నుంచి 12 జట్లు పాల్గొని, తమ సత్తా చాటాయి. కార్యక్రమంలో శ్రీకాకుళం జిల్లా అగ్నిమాపక అధికారి జడ్డు మోహనరావు, గ్రామపెద్దలు పొగిరి లెనిన్, జడ్డు జగదీష్, జడ్డు విష్ణుమూర్తి తదితరులు పాల్గొన్నారు.